కథ

# చికిత్స

పాలపర్తి జ్యోతిష్మతి

"నీరజా! నేను నిన్ను ప్రేమిస్తున్నానని రెండుసార్లు చెప్పాను. నువ్వు నా మాటలు పట్టించుకోలేదు. ఇవాళ నిన్ను వదిలిపెట్టను. నాకు సమాధానం చెప్పి తీరాలి. నువ్వు కాదన్నావంటే..."

"ఎందుకంత తొందరపడతావు వంశీ! నేను కాదనలేదు కదా!"

"అంటే... ఒప్పుకున్నట్టేనా?"

"నేను నీ ప్రేమను అంగీకరించే ముందు నువ్వు నా గురించీ మా వాళ్ళను గురించీ, నేను నీ గురించీ మీ వాళ్ళ గురించీ కొన్ని విషయాలు తెలుసుకుంటే బాగుంటుంది కదా?"

"అడుగు, నీకు ఏ వివరాలు కావాలో, చెప్తాను?"

"ఇక్కడ కాదు. సాయంత్రం ఆరింటికి మా ఇంటికి రా. అక్కడ మాట్లాడుకుందాం"

"ఏం? ఇంట్లో ఎవరూ లేరా?"

"అమ్మా, నాన్నా, అన్నయ్యా, చెల్లీ అందరూ ఉన్నారు. నిన్ను ఇంటికి పిలుస్తానని ముందే చెప్పాను"

"ఆఁ!" సంతోషమో, సందేహమో, ఆశ్చర్యమో, ఆమోదమో, అన్నీనో అర్థంకాని శబ్దం వెలువడింది వంశీ నోటివెంట.

చక్కగా తయారయి ఆరింటికల్లా నీరజ ఇంటికెళ్ళాడు వంశీ. లోపలికి తీసుకెళ్ళి అందరికీ పరిచయం చేసింది నీరజ.

"గదిలో కూర్చుని మాట్లాడుకోండి బాబూ!" అన్నారు నీరజ నాన్నగారు.

గదిలోకెళ్ళి కూర్చోగానే రెండు గ్లాసులతో చల్లని నిమ్మరసం తెచ్చి బల్లమీద పెట్టి "తాగుతూ మాట్లాడుకోండి" అనేసి వెళ్ళిపోయారు నీరజ అమ్మగారు.

ఒక గ్లాసు వంశీ చేతికిచ్చి రెండోది తను తీసుకుంటూ "ఇందాక 'నువ్వు కాదన్నావంటే' అని ఏదో చెప్పబోయావు. ఇప్పుడు చెప్పు" సూటిగా వంశీవైపు చూస్తూ అడిగింది నీరజ

చేతిలోని గ్లాసు మీదే దృష్టి కేంద్రీకరించిన వంశీ తలెత్తి నీరజవైపు చూశాడు. ప్రశాంతంగా ఉన్న ఆ కళ్ళలో తిరస్కారం కనిపించినట్టు అనిపించింది. గ్లాసు బల్లమీద పెట్టి అసహనంగా చేతులు రుద్దుకున్నాడు.

లోపల ఉన్న చల్లని నీళ్ళ వల్ల గ్లాసు చుట్టూ ఏర్పడిన తేమ నీటి బిందువులుగా మారి బల్లమీదికి జారుతోంది. గ్లాసు లోపలి ద్రవం చల్లదనం కోల్పోయి వేడెక్కుతోంది.

గ్లాసు చేతిలోకి తీసుకుని దాని చుట్టూ వేళ్ళు గట్టిగా బిగించాడు వంశీ. "చంపేస్తా" కసిగా అన్నాడు.

"ఒరే! రాజా! ఎక్కడున్నావు" నీరజ నాన్నగారు కొడుకుని పిలుస్తూ లోపలికి తొంగిచూసి "సారీ!" అనేసి వెళ్ళిపోయారు.

"ప్రేమిస్తున్నానంటావు. చంపేస్తానంటావు, నాకర్థం కావట్లేదు. నాకు తెలిసినంతవరకూ ప్రేమ బతికిస్తుంది. చంపదు".

"అంటే..." విసుగ్గా అడిగాడు వంశీ.

నీరజ చెప్పడం మొదలుపెట్టింది. "నాలుగు నెలల క్రితం మా నాన్నగారికి యాక్సిడెంట్ అయ్యింది. చాలా రక్తం పోయింది. బ్రతకడం కష్టం అన్నారు డాక్టర్లు. నేనూ, మా అన్నయ్య రక్తం ఇచ్చి నాన్నని రక్షించుకున్నాం."

"ఇప్పుడీ విషయం నాకెందుకు చెప్తున్నావు?"

"నేనూ, అన్నయ్య నాన్నకి రక్తం ఎందుకిచ్చామంటావు?"

"...."

"ఎందుకంటే మేము నాన్నని ప్రేమిస్తున్నాం. కాబట్టే బ్రతికించుకోవాలనుకున్నాం. బ్రతికించుకున్నాం"

"నువ్వు నన్ను ప్రేమిస్తే ఎందుకు చంపుతావు? నువ్వు నన్నుకాదంటే... నాకు నచ్చదు. చంపేస్తాను"

"నచ్చకపోతే చంపెయ్యడమేనా?"

"అంతే" గ్లాసు ఖాళీ చేసి విసురుగా బల్లమీద పెడుతూ చెప్పాడు వంశీ.

"లతా! గ్లాసులు తీసుకెళ్ళు" చెల్లెల్ని పిలిచింది నీరజ.

లత వచ్చి గ్లాసులు తీసి పాతగుడ్డతో బల్ల తుడిచి వెళ్ళిపోయింది.

"నాలో ఏం చూసి నన్ను ప్రేమిస్తున్నావు?"

"నువ్వు చాలా తెలివైనదానివి. ఎప్పుడూ క్లాసులో ఫస్ట్ వస్తావు."

"నీ కిష్టమైనదాన్ని సొంతం చేసుకోడానికి ప్రయత్నించొచ్చు కదా?"

"అదే కదా నేను చేస్తున్నది"

నీరజ పెదాలు విడీవిడవకుండా నవ్వింది. ఆ నవ్వులో ఏదో అర్థం ఉందనిపించింది వంశీకి.

"మీ నాన్నగారు నువ్వు ఫస్టుక్లాసులో పాసవ్వాలనీ క్లాసులో ఫస్ట్ రావాలనీ కోరుకోరా?"

"కోరుకుంటారు"

"నువ్వు ఏవరేజ్ స్టూడెంట్‌వి కదా? అది ఆయనకి నచ్చుతుందా?"

"నచ్చదు"

"మరి నిన్ను ఆయన చంపెయ్యలేదే?"

వంశీ కోపంగా లేచి నిలబడ్డాడు.

నీరజ అమ్మగారు చీపురు పట్టుకుని లోపలికి వచ్చి "సరే! తర్వాత ఊడుస్తాన్లే మాట్లాడుకోండి". అనేసి వెళ్ళిపోయారు.

కూర్చోమన్నట్టు కుర్చీవైపు చెయ్యి చూపిస్తూ అడిగింది నీరజ "నీకు ఏ కూర అస్సలు ఇష్టముండదు?"

"వంకాయ కూర", నీరసంగా కుర్చీలో కూలబడుతూ చెప్పాడు వంశీ.

"మరి మీ ఇంట్లో ఎప్పుడూ వంకాయ కూర చెయ్యరా?"

"ఎందుకు చెయ్యరు? మా నాన్నకి వంకాయ కూర అంటే ఇష్టం"

"చేస్తే నువ్వు తింటావా?"

"నా కోసం ప్రత్యేకంగా బంగాళదుంపలు వేయిస్తుంది మా అమ్మ"

"ఒకవేళ ఎప్పుడైనా వంకాయకూర తినమని మీ అమ్మగానీ, నాన్నగానీ నిన్ను బలవంతం చేశారనుకో"

"తినను"

"ఇంకేకూరా లేకపోతే"

"అన్నం తినడమైనా మానేస్తాను కానీ నా కిష్టంలేనిది నేను తినను"

"నీ కిష్టం లేనిదాన్ని దూరంగా ఉంచే స్వాతంత్ర్యం నీకు ఉందంటావు"

"అవును" కించిత్తు గర్వం ధ్వనించింది వంశీ గొంతులో.

"మరి ఆ స్వాతంత్ర్యం ప్రపంచంలో మనుషులందరికీ ఉండాలి కదా?"

మొదటిసారిగా 'నీరజ తనను ఎటు తీసుకుపోతోంది' అన్న అనుమానం వచ్చింది వంశీకి.

"నీకేం కావాలంటే అది. ఇంకా చెప్పాలంటే నీకు కావల్సిందల్లా టంచనుగా అమరుస్తున్నారు మీ అమ్మా నాన్న. అవునా?"

"..."

"చాలా గొప్పగా పెంచుతున్నారు."

చివ్వున తలెత్తి మింగేసేటట్టు చూశాడు వంశీ నీరజని.

"ఎక్స్‌క్యూజ్ మి" అంటూ రాజా గదిలోకొచ్చి మూల ఉన్న క్రికెట్ బ్యాటూ, బాలూ తీసుకొని బయటికెళ్ళిపోయాడు.

"ఇంకేం మాట్లాడాల్సింది లేదు. ఆలోచించుకుని నిర్ణయించుకో", ఇంక నువ్వెళ్ళొచ్చు అన్నట్టు లేచి నిలబడింది నీరజ.

యాంత్రికంగా లేచి బయటికొచ్చాడు వంశీ. హాల్లో నీరజ నాన్నగారు పేపరు చూస్తున్నారు. అమ్మగారు ఏదో కుట్టుకుంటున్నారు. రాజా క్రికెట్ బ్యాటూ బాలూ తదేక దీక్షతో పరీక్షిస్తున్నాడు. లత చదువుకుంటోంది. అంతా ఒక్కసారి తలెత్తి వంశీవైపు చూసి మళ్ళీ తమ తమ పనుల్లో పడిపోయారు.

'తన నిర్ణయం చెప్పడం పోయి నన్ను ఆలోచించుకుని నిర్ణయించుకోమంటుందేంటి? వాళ్ళింట్లో కూర్చున్న ఈ గంట సేపట్లో అసలు నీరజ ఏం మాట్లాడింది? వాళ్ళ నాన్న యాక్సిడెంటూ, తనూ వాళ్ళన్నయ్యా రక్తమివ్వడమూ - ఇవేనా తన గురించి నాకు చెప్పదలచుకున్నది. వంకాయకూరా, బంగాళదుంపలవేపుడూ - ఇవేనా నా గురించి తన తెలుసుకోవాలనుకున్నది. లేకపోతే దాంట్లో ఇంకేమైనా అర్థముందా? మధ్యమధ్యలో ఇంట్లో వాళ్ళు ఒక్కక్కరూ వచ్చి మొహం చూపించి వెళ్ళడమేంటి?' ఆలోచనల మధ్య ఎట్లా వచ్చాడో తనకే తెలియకుండా ఇంటికొచ్చిపడ్డాడు వంశీ.

"అప్పుడే వచ్చేశావేంటిరా? ఫ్రెండ్స్ ఎవరూ చదువుకోవడానికి రాలేదా?" వంశీని చూడగానే అడిగారు వాళ్ళ నాన్న.

"రేపు సెలవే కదా! రేపు బాగా చదువుకోవచ్చని ఇవాళ తొందరగా వెళ్ళిపోయారేమో!" అంది అమ్మ. "ఈ పూట వంకాయ కూర. నువ్వొచ్చేటప్పటికీ ఆలస్యమవుతుందికదా. బంగాళదుంపలు నెమ్మదిగా వేయించొచ్చులే అనుకున్నాను. ఫర్వాలేదులే. స్నానం చేసిరా. ఈ లోపల వేయించేస్తాను. అందరం కలిసి పెందరాళే భోంచేద్దాం" అంటూ లోపలికెళ్ళింది.

అన్యమనస్కంగానే భోజనం పూర్తిచేసి గదిలోకెళ్ళాడు వంశీ. తమ్ముడూ చెల్లెలూ చదువుకుంటున్నారు. పుస్తకం పట్టుకునికూర్చున్నాడు కానీ ఆలోచనలు వదిలిపెట్టట్లేదు. నీరజ మాటలూ, వాళ్ళిల్లూ, ఇంట్లో వాతావరణం మనసును ఆక్రమించుకుని కదలట్లేదు.

"శ్రద్ధ పెట్టి చదవరా. చదువుని నిర్లక్ష్యం చేస్తే మనకి భవిష్యత్తు లేదు"

ఉలిక్కిపడి తలెత్తి చూశాడు వంశీ. పుస్తకం ముందు పెట్టుకుని పెన్నుతో ఆడుకుంటున్న తమ్ముణ్ణి మందలిస్తోంది చెల్లెలు. 'తనని అంత మాట అనే ధైర్యం దానికెక్కడిది?

'వాళ్ళిద్దరూ ఎప్పుడూ తనకి సాధ్యమైనంత దూరంగా ఉండడానికి ప్రయత్నిస్తారు. తను నీరజ వెంటపడుతున్నట్టు వాళ్ళకి తెలుసు. నీరజ కాదంటే చంపెయ్యడానికి ప్లాన్ చేస్తున్నట్టు కూడా తెలిసే ఉండొచ్చు. వాళ్ళకి తనంటే భయమా? కోపమా? అసహ్యమా?

'అమ్మా, నాన్నలకి ఈ విషయాలేమీ తెలీవు. తను ఫ్రెండ్స్‌తో కలిసి పొద్దుపోయేదాకా చదువుకుంటున్నాననుకుంటున్నారు. తను అమ్మా నాన్నల్ని మోసం చేస్తున్నాడా? వాళ్ళకి చెడ్డపేరు తెస్తున్నాడా?

'నీరజ అమ్మా నాన్నల్ని పొగిడిందా? తిట్టిందా?

'నీరజకి వాళ్ళింట్లో వాళ్ళతో ఉన్నటువంటి అనుబంధమే ఉందా తనకీ, తన ఇంట్లోవాళ్ళకీ మధ్య?

'ఎంత ధైర్యంగా తనను ఇంటికి పిలిచి ఇంట్లో వాళ్ళకు పరిచయం చేసింది! వాళ్ళంతా ఎంత అభిమానంతో నీరజకు సహకరించారు!

'తన గురించి వాళ్ళకు ఏమి చెప్పి ఉంటుంది? తనెందుకు అంత సూటిగా వ్యవహరించలేక పోతున్నాడు?

'నీరజకి స్నేహితులు కూడా ఎక్కువే. అందరూ నీరజతో స్నేహం కోరుకుంటారు. ఎప్పుడూ నీరజ



62వ జన్మదినోత్సవం సందర్భంగా డా॥ ధ్వా.నా. శాస్త్రిని సత్కరిస్తున్న డా॥ సి. నారాయణరెడ్డి, పద్మశ్రీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శ్రీ మండలి బుద్ధప్రసాద్, ఆచార్య పేటశ్రీ ప్రభృతులను చిత్రంలో చూడవచ్చు.

చుట్టూ పదిమంది ఉంటారు. కానీ తనకి...? ఉన్నది ఒకే ఒక్క స్నేహితుడు. ఒకటో తరగతి నుంచీ కలిసిమెలిసి తిరిగిన అనుబంధంతో మొన్నమొన్నటి వరకూ వాడు తనని వదిలిపెట్టలేదు. కానీ తనే వాడితో గొడవపడి దూరం చేసుకున్నాడు. 'ప్రేమిస్తున్నాంటూ ఆడపిల్లల వెంటబడి వాళ్ళని ఇబ్బంది పెట్టడం తప్పురా' అని తనకి నీతులు చెప్పబోయాడు. 'నీరజ తెలివైంది కాబట్టి ఆ అమ్మాయి చేత నీకు అర్థంకాని పాఠాలు చెప్పించుకో. మంచి మార్కులు తెచ్చుకోడానికి టిప్స్ నేర్చుకో. అంతేకానీ తెలివితేటల్ని చూసి ప్రేమించడమేమిటి, ఆ అమ్మాయి ఒప్పుకోకపోతే చంపెయ్యాలను కోవడమేమిటి? పెడదారిలో పోతున్నావు. నీ పద్ధతి మార్చుకో' అంటూ హితబోధ చేశాడు. తను కోపం పట్టలేక వాడిమీదపడి కొట్టినంత పనిచేశాడు. అంతే, వాడూ తన స్నేహం వదిలేసి వెళ్ళిపోయాడు.'

వంశీ లేచి అసహనంగా అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టాడు. ఆలోచనలతో ఎంత సమయం గడిచిపోయిందో తెలియలేదు.

'నీరజ ఎంత దారుణంగా మాట్లాడింది? నాన్న తనని చంపాలట!

'అవును మరి, తనే కదా అన్నాడు. నచ్చకపోతే చంపెయ్యాలని.

'తప్పు తనదేనా? తన నడవడికలోనే లోపం ఉందా?

'నిజమే! ఇప్పటిదాకా తను వెళుతున్నది చెడు మార్గమే. తనే మారాలి.

'ఇప్పుడు తనకే తను నచ్చట్లేదు. అంటే తనని తనే చంపుకోవాలా?'

లైటు ఆపేసి పడుకున్నాడు కానీ నిద్ర పట్టలేదు. కాసేపు అటూ ఇటూ దొర్లి లేచి కూర్చున్నాడు.

'అవును. అదే జరగాలి. తన ఆలోచనల్లోనూ, ప్రవర్తనలోనూ ఉన్న చెడును చంపేసుకోవాలి. అందరికీ నచ్చేవిధంగా తనను తాను తీర్చిదిద్దుకోవాలి'.

కుర్చీ దగ్గరకెళ్ళి ఇవతలికి లాగబోయి తలతిప్పి ప్రశాంతంగా నిద్రపోతున్న తమ్ముణ్ణీ, చెల్లెల్నీ చూశాడు. శబ్దం కాకుండా మెల్లగా కుర్చీ జరుపుకుని, కూర్చుని టేబుల్‌లైటు వేసుకుని పుస్తకం తెరిచాడు.

అప్పుడు తెలిసింది వంశీకి నీరజ పెదాలపై కదలాడిన కనబడీ కనబడని నవ్వుకు అర్థం.

పురాణపండ రంగనాథ్

# లూసీ బ్రౌన్ కథ(నం)



**నా** పేరు లూసీ బ్రౌన్ వయస్సు 30 సంవత్సరాలు అదిసరే! మాకీ వివరాలెందుకని మీరడగవచ్చు !

నేను మీ అందరిలాంటి పిల్లనుకాను, టెస్టుట్యూబ్ బేబీని, 1978 జూలై 25 న నేను ఇంగ్లాండులోని ఓల్డ్ హామ్ ఆస్పత్రిలో జన్మించిన ప్రపంచపు తొలి టెస్టు ట్యూబ్ బేబీని పుట్టినపుడు నా బరువు 2 .61 కిలోలు మా అమ్మపేరు లెస్లీ బ్రౌన్, మా నాన్న పేరు జాన్ వారి వివాహ మయ్యాక 9 ఏళ్ళ వరకు పిల్లలు పుట్టలేదు. అప్పుడు వారు వైద్యుల్ని సంప్రదించారు. మా అమ్మకి అండ వాహికలు పూడిపోయి వున్నందున సంతానం కలగలేదని వైద్యులు గుర్తించారు. అప్పట్లో కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో రాబర్ట్ ఎడ్వర్ పేట్రిక్ స్టెప్టో అనే వైద్య పరిశోధకులు సంతాన హీనులకు సంతాన ప్రాప్తికై పరిశోధనలు చేస్తున్నారు. మా అమ్మ, నాన్న, వారి సలహామేరకు ఐ.వి.ఎఫ్ ప్రక్రియ ద్వారా సంతానాన్ని పొందాలని కోరుకున్నారు. ఐ.వి.ఎఫ్ అనగా ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ అని అర్థం. ఈ ప్రక్రియలో మా నాన్న శుక్ర కణాలను మా అమ్మ గ్రుడ్డు కణంతో గర్భాశయం వెలుపల ఫలదీకరింపజేసి ఆ పిండాన్ని మరల అమ్మ గర్భాశయంలో ప్రవేశ పెడతారు. 9 మాసాలపాటు గర్భంలో పెరిగి నేను జన్మించాను.

అందరిలాగే నేను మామూలుగా పెరిగాను. పిల్లలు నా గురించి విచిత్రంగా నేను టెస్టు ట్యూబ్‌లో ఎలా పెరిగానని అడిగేవారు. నేను మా అమ్మని వివరం అడిగాను. ఆమె నా పుట్టుక కథనం వీడియో ద్వారా చూపించింది. నేను ఆ వివరాలను తెలుసుకొని ఆశ్చర్యపడ్డాను. నేను పుట్టిన తరువాత 4 ఏళ్ళకు మా చెల్లి ఐ.వి.ఎఫ్, ప్రక్రియ ద్వారానే జన్మించింది. ఆమె పేరు "నటాలి బ్రౌన్" అప్పటికి ప్రపంచ వ్యాప్తంగా ఈ ప్రక్రియ ద్వారా 40 మంది టెస్టు ట్యూబ్ బేబీలు జన్మించారు. 1999 లో మా చెల్లి సహజ ప్రక్రియ ద్వారా బిడ్డను ప్రసవించింది.

నాకు 2004 లో వివాహమయ్యింది. నా భర్త పేరు ముల్లిందర్ అతను నైట్ క్లబ్‌లో ఉద్యోగి. మా దాంపత్యం ఫలితంగా 2006 లో నాకు అబ్బాయి పుట్టాడు. వాడి పేరు" కామెరాన్ " వాడి వయస్సు ఇప్పుడు 18 నెలలు నేను స్వభావరీత్యా బిడియస్తురాలను అయినా నేను నా సృష్టి కర్తలయిన ఎడ్వర్డ్స్, స్టెప్టోలతో సన్నిహితంగా వుండేదాన్ని. 1988 లో స్టెప్టో మరణించారు. ప్రపంచపు తొలి టెస్టు ట్యూబ్ బేబీ నైనా అదేమి పట్టదు. అందుకే ఈ ఏడాది నా 30 వ పుట్టిన రోజును నిరాడంబరంగా జరుపుకున్నాను.నేను ఓషిప్పింగ్ కంపెనీలో ఉద్యోగినిగా వున్నాను. అందరిలాగే స్నేహితుల మధ్య, బంధువుల మధ్య, నిరాడంబరంగా గడపడం నాకు ఇష్టం ఇది నా కథ. మీ అందరి ఆశీస్సులు అర్థిస్తున్నాను.